# చెల్లెలు



- పి. కుసుమారెడ్డి

ఫిబ్రవరి నెల...

ఎముకల్ని కొరికే చలి...

చెట్లమీద నుండి జారుతున్న మంచు బిందువులు దండ తెగిన మంచిముత్యాల్లా వున్నాయి.

కిటికీలో నుండి మంచం మీద పడుతున్న సూర్య కిరణాలు పల్చని వెండితీగల్లా వింత సోయగాన్ని స్తున్నాయి.

మంచు పొగ చుట్టు ముట్టినట్లు ఉండటంతో, ఏడు గంటలు దాటినా అంత టైమ్ అయినట్లు లేదు.

పాదాల నుండి తల వరకు మునుగు పెట్టి పడుకున్న తల్లిని 'లేపాలా వద్దా' అన్న సందిగ్ధంలో పడింది నాలుగేళ్ళ అమని. తను ఎప్పుడన్నా జ్వరం వచ్చినప్పుడు చలిగా వుండి మొహం మీద నుంచి మునుగు పెట్టి పడుకొన్నప్పుడు 'చచ్చిపోయిన వాళ్ళకే అలా కప్పుతారు' అని తల్లి కసరడం తనకి బాగా గుర్తు.

అమ్మ గాని చచ్చిపోలేదు కదా?

మరి మునుగు ఎవరు పెట్టి ఉంటారు?

భయంతో దుప్పటి తీసి చూడాలనిపించింది ఆ పసి మనసుకి. కాని దుప్పటి తీశాక అమ్మ చావకపోతే తనను చంపేస్తుందే!

ఎటు పయనించాలో తెలియని గాలిపటంలా అమని మనసు ఊగిసలాడింది.

అమని ఆలోచనలని చెదరగొడుతూ అలారం మోగినట్లు అరున్నొక రాగం అందుకుందీ పదకొండు నెలల పావని. ఊయల అంచుని పట్టుకొని పైకి లేవాలనే ప్రయత్నం చేస్తోంది.

చెల్లెలు పడిపోతుందన్న భయంతో ఒక్క ఉదుటున ఊయల దగ్గరకు పరుగు తీసింది అమని.

అమని చేయి చాచడం ...పావని పట్టు తప్పి కింద పడటం...చందన లేవడం...అమని చెంపలు చందన వాయించడం క్షణంలో జరిగాయి.

" దరిద్రపు ముండా, ఆదివారం పూట కూడా నాకు నిద్రపోయే యోగం లేకుండా చేస్తున్నారు. మీ బాబు నా మెడలో ఉరి వేశాక నిద్ర కరువైంది. మీరు పుట్టాక మొత్తం అన్నీ కరువైనాయి. ఏ జన్మలో ఏం పాపం చేశానో ఈ అనాకారిది..పుట్టింది. దెయ్యం మొహంలా ఉంది. ఇది నీకు అంత ముద్దు వస్తుందా! నలుపుకి తోడు కళాకాంతీ లేని మొహం"

నోరెరగని పావనిని నాలుగు అంటించి తన కసిని తీర్చుకుంది చందన.

కొడుతున్న తల్లిని..కొట్టిన దెబ్బలకి తట్టుకోలేక గుక్కపెట్టి ఏడుస్తున్న పావనిని చూసేసరికి అమని కళ్ళలో నీళ్ళు ఊరాయి.

అమ్మకి చెల్లెలంటే ఎందుకంత పగ?

ఎప్పుడూ దగ్గరికి చేర్చుకోదు.

అమని లేత మనసులో చెప్పలేని అలజడి. పనిమనిషి సుందరి చందనకి కాఫీ అందించి...పావనిని రెక్క పట్టుకొని బాత్ రూమ్‌లోకి తీసుకెళ్ళడం అమనికి రుచించలేదు.

"సుందరీ - ఆ నల్లముండ వంటికి నలుగు బాగా పెట్టవే. కాస్త తెలుపు వచ్చి చస్తుందేమో! ఛీ.ఛీ! పిత్తనం ఒకటి...మొక్క ఒకటి అవుతుందా! నా కూతురని చెప్పుకోవడానికి కూడా సిగ్గుగా వుంది"

పనిమనిషి ముందు చందన అలా మాట్లాడ్డం అమనికి కడుపులో చెయ్యి పెట్టి దేవినట్టుంది.

* * *

సుందరి పావనికి స్నానం పూర్తి చేయించి... పొడరు అద్ది మంచం మీద పడుకోబెట్టింది.

పావనిని జోకొడుతున్న అమనికి చెల్లెలి వీపు మీద తల్లి కాఠిన్యానికి గుర్తుగా బొబ్బలు కనిపించాయి.

తనను ముద్దు చేసే తల్లి చెల్లెల్ని ఎందుకంత నిర్లక్ష్యం చేస్తుందో అమని పసి మనసుకు అంతుపట్టలేదు.

హాల్లో వాషింగ్ మిషన్‌లో బట్టల్ని శుభ్రం చేస్తున్న పనిమనిషిని చూస్తుండమని అమనితో చెప్పి ఆఫీసుకు వెళ్ళింది చందన.

* * *

స్నేహితురాలు కల్యాణి కొడుకు పుట్టిన రోజుకి వెళ్ళి వస్తున్న చందనలో ఏదో అలజడి.

తనకి కల్యాణి ఇటీవలే పరిచయం అయింది. చాలా సార్లు యింటికి రమ్మని కల్యాణి ఆహ్వానించినా తను వెళ్ళలేదు. కారణం అరమరికలు లేని ఆ భార్యాభర్తల అనురాగం గురించి వింటుంటే అసూయగా వుండేది.

తను భర్తను వదిలేసిన ఆడది. ఓ అనాకారి బిడ్డకి తల్లి. చిదిమితే పాలు కారేట్టు ఉండే ఆమని అంటే వుండే యిష్టం కూడా భర్త వివేక్ వంచన గుర్తొచ్చి అణగారిపోయింది.

కల్యాణిని తన యింటికి పిలిస్తే...కాకిపిల్లలా వుండే తన కూతురు పావనిని చూసి ఏమైనా అనుకొంటే అది తనకు చిన్నతనం!

భర్త గురించి అడిగితే ఉద్యోగరీత్యా దూరంగా ఉన్నాడని చెప్పింది తను.

కాని కల్యాణి - !

సమాజంలో తోడేళ్ళ బారినుండి తప్పించుకోవడానికి పెళ్ళి అయినదానిలా నటిస్తున్న తాళికి నోచుకోని ఓ అందాలభరిణి కల్యాణి...

'అమ్మా' అని నోరారా పిలవలేని ఓ గాజు బొమ్మకి తల్లి కల్యాణి.

మంచి..సూటు..బూటు వేసుకొని చిన్నసైజు హీరోలా ఉంటాడనుకొన్న బ్రెయిన్ పనిచేయని ఓ మట్టిబొమ్మకి తల్లి కల్యాణి..

కదలలేడు..కూర్చోలేడు..మాట్లాడలేడు..నడవలేని స్పాస్టిక్ చైల్డ్‌ని మల్లెపువ్వులా నలగకుండా..లాలిస్తూ.. బుజ్జగిస్తూ...నిత్యం కనిపెట్టుకొని పెంచుతోంది కల్యాణి.

ఏనాటికీ పుష్పించని క్రోటన్ మొక్క కోసం అహో రాత్రులు శ్రమించుతున్న కల్యాణి కొడుకు కోసం సుమారు లక్షరూపాయలు ఖర్చు చేసిందట!

ప్రస్తుతం నెలకి ఏడెనిమిదివందలు ఖర్చు పెడు తోందట. కల్యాణి కంటె తను ఎంత నయం - కాని తను చేస్తున్నదేమిటీ!

ఎంతో అందంగా ఉంటుందని ఊహించుకొన్న తమ దాంపత్యజీవితం ముక్కలు కావడం సహించ లేక..ఆ కోపమంతా పిల్లల మీద చూపిస్తోంది.

చిన్నప్పుడే ఊహ తెలియని వయసులో ఆస్తి తప్ప అందం లేని బావతో వివాహమైంది. తను ఎదిగాక చదువుకొంటానని పట్టుబట్టడం..భర్త అయిష్టంగా ఒప్పుకోవడం జరిగింది.

సరిగ్గా అప్పుడే లెక్చరర్‌గా పని చేస్తున్న అందగాడైన సంజయ్ మీద తన మనసు పడింది. భర్తనీ..సంజయ్‌నీ వూహల్లో పోల్చుకొని బాధపడ్డం మిగిలింది!

చదువు పూర్తయ్యాక భర్త కాపురానికి తీసుకెళ్ళడం.. ఆమని పుట్టడం రొటీన్‌గా సాగింది కాపురం.

భర్త తన దగ్గిరకు వస్తే కంపరంగా వుండేది. అందువల్ల తనకు తోచడం లేదనీ ఉద్యోగం చేస్తానని ప్రపోజల్ పెడితే భర్త అంగీకరించలేదు. కాపురం నిప్పుల మీద నడకే అయింది.

అప్పుడే ఓ పిడుగులాంటి నిజం తెలిసింది.

భర్త పెళ్ళికిముందే ఎవరితోనో సంబంధం పెట్టుకున్నా డట. ఆమె ఒక బిడ్డకు తల్లయ్యాక..ఆమెను కూడా యింటిలో పెడతానన్నాడు. సహించలేక తను విడాకు లిచ్చింది.

అనాకారి భర్తతో తెగతెంపులు చేసుకోడానికి ఓ వంక దొరికింది, సమాజంలో తను ముద్దాయి కాకుండా.

పావని పుట్టినప్పుడు ఎన్నోసార్లు భగవాన్ ఈ బిడ్డ నాకొద్దు. దయచేసి చంపెయ్యి అని రోదించిన క్షణాలు ఉన్నాయి.

ఏనాడూ ఆ పిల్లను తల్లిగా తను అక్కున చేర్చుకొని లాలించలేదు. పాలిచ్చి పెంచలేదు. రోగం వస్తే సరి అయిన 'మందు వేయించలేదు.

భర్త పోలికలొచ్చిన పావని మీద, అతనిమీద అసహ్యమంతా చూపిస్తోంది.

కాని కల్యాణి తన కళ్ళు తెరిపించింది. మాతృత్వం అంటే ఏమిటో తెలియచెప్పింది.

'ఇక నుంచి నా యిద్దరు పిల్లలూ నాకు రెండు కళ్ళు..పావని మాత్రం నా రక్తం పంచుకొని పుట్టింది కాదా - దాన్నెందుకు అసహ్యించుకోవాలి' అనుకొంటూ కాలింగ్ బెల్ స్విచ్ నొక్కి ఎవరూ రాకపోయేసరికి కిటికీలోంచి తొంగి చూసింది. ఉయ్యాలలో వుండాల్సిన పావని వాషింగ్‌మిషన్‌లోంచి తొంగి చూస్తోంది..!

'ఆమనీ - ఆమనీ' ఆదుర్దాగా అరిచింది చందన. తలుపు తీసిన ఆమని భయంతో వణికిపోతూ విల్చుంది.

"దాన్ని వాషింగ్ మిషన్‌లో పెట్టి ఏం చేస్తున్నావే?" కోపంగా కాదు - ఆందోళనతో అడిగింది.

"మరే..మరేమో..నువ్వది నల్లగావుందని తిడు తున్నావు కదూ, ఆ మిషన్‌లో వేస్తే తెల్లగా వస్తుందని.."

ఆమని మాటలు పూర్తి కాకుండా చందన ఆత్రంగా వెళ్ళి మిషన్‌లోంచి అమాయకంగా నవ్వుతున్న పావనిని గుండెలకు హత్తుకొంది. తను రావడం క్షణం ఆలస్యమైతే జరగబోయే దృశ్యం స్ఫురించి - మమత పెల్లుబికి పావనిని ముద్దులతో తడిపేసింది.

ఆశ్చర్యంగా తనకేసి చూస్తున్న ఆమనిని -

'నీకెవరు చెప్పారే? ఇంకెప్పుడూ ఇలా చెయ్యకే తల్లీ'.. అంటూ అనునయంగా మందలిస్తూ రెండో చేత్తో తన దగ్గరకు తీసుకొంది చందన. □


స్త్రీల టానిక్ లోధ్ర

బాధారహిత
ఆరోగ్యమును స్త్రీలకు
90 సంవత్సరములుగా ఇచ్చుచున్నది.
ఉచిత వైద్య సలహాకు ఈ కూపను
మీ వ్యాధి వివరములతో పంపండి.




పేరు : ____________________

విలాసము : ____________________

PIN. ____________________

తయారుచేయువారు:

కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట, మద్రాసు–600 014.

ఏజంట్లు : సీతారామ జనరల్ స్టోర్సు ఏజన్సీస్,
విజయవాడ – 1 – సికిందరాబాద్